# దాశరథీ శతకము

## (తాత్పర్య సహితము)

*శ్రీ రఘురామ, చారు తులసీ దాళధామ, శమక్షమాది శృం*
*గార గుణాభిరామ; త్రిజగన్నుత శౌర్య రమాలలామ దు*
*ర్వార కబంధ రాక్షస విరామ; జగజ్జన కల్మషార్ణవో*
*త్తారకనామ భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ.* **1**

**తా.** ఓ రామా! నీవు తులసీమాలలను దండగా ధరించి, శాంతము క్షమ మొదలైన మనోహర గుణములు కలిగి మూడు లోకములలో కీర్తింపబడిన వాడవు. ఉత్కృష్టమైన పరాక్రమము అనే ఆభరణంతో విలసిల్లి అపజయములేని కబంధుడను రాక్షసుని సంహరించి లోకజనులను పాపమనే సముద్రం నుండి తొలగించుచూ సముద్రమంతటి కరుణతో భద్రాచలమునందు వేంచేసి ఉన్న దశరథ పుత్ర రామా.

***సర్వపాపములను హరించువాడు భద్రాద్రి రాముడు.***

**చ.** *అగణిత సత్యభాష, శరణాగతపోష, దయాలస ఝరీ*
*నిగత సమస్తదోష, పృథివీసురతోష, త్రిలోక పూతకృ*
*ద్గగనధు నీమరంద పద కంజవిశేష మణిప్రభా ధగ*
*ద్ధగిత విభూష భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ.* **2**

**తా.** ఓ భద్రాది రామా ఎప్పుడూ నిజమును చెప్పుచూ పలుకుచూ శరణాగతరక్షకుడివిగా ఉండి కరుణతో సర్వపాపములను హరించువాడవు. సత్ బ్రాహ్మణులను తృప్తి పరచువాడవు, ఆకాశగంగలోని పద్మములందని పుప్పొడిచే అలంకరింపబడిన పాదపద్మములు కలిగి, ధగ ధగ మెరిసే రత్నములను ఆభరణములుగా ధరించు వాడవు, దయగల వాడవు! (నీ మహిమను నేనెలా వర్ణింపగలను.)

*దుష్టులను శిక్షించు వాడు ఆ రాముడు అంటూ ........!*

*ఉ. రంగదరాతి భంగ, ఖగ రాజతురంగ విపత్పరంపరో*
*త్తుంగ తమఃపతంగ, పరితోషితరంగ, దయాంతరంగ స*
*త్సంగ ధరాత్మజాహృదయసారసభృంగ నిశాచరాబ్జమా*
*తంగ శుభాంగ భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ. 3*

**తా.** ఓ రామా! సద్గుణములు నీ సొంతం. నీవు తేజోవంతుడు, పరాక్రమములు గల శత్రువులను నాశనము చేసినవాడవు, గరుత్మంతునినే అశ్వముగా కలవాడవు, కష్టములను కారు చీకట్లను తొలగించే సూర్యుడవు. మంచివారి సాన్నిత్యము గల నీవు నీవు దయను కలిగినవాడవు. సీతాదేవి హృదయమను పద్మమునకు తుమ్మెదవంటి వాడవు. రాక్షసులను నాశనము చేయు ఏనుగువంటి వాడవు, మంగళప్రదమైన అవయవములు కలిగిన వాడవు. (మంచివారిని ప్రేమించువాడవు)

*శ్రీరాముడి గుణాలను వర్ణించుచు ........!*

*ఉ. శ్రీద సనందనాది ముని సేవిత పాద దిగంతకీర్తి సం*
*పాద సమస్తభూత పరిపాల వినోద విషాద వల్లికా*
*చ్ఛేద ధరాధినాథకుల సింధుసుధామయపాద నృత్తగీ*
*తాది వినోద భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ. 4*

**తా.** నీవు ఐశ్వర్యములను ఇచ్చే వాడవు, సునందుడు మొదలైన ఋషులచే కొలుచునట్టి పాదపద్మములు కలిగిన వాడవు, అన్ని దిక్కుల అంచుల వరకూ కిర్తీని సంపాదించినవాడవు, రాజవంశమునందు ఉదయించిన చంద్రుని వంటి వాడవు. నీవు ఆటపాటలచే ఆనందింపబడెడి వాడవు. కరుణాపయోనిధీ, దశరథరామా! (నీవంటివాడు మరొకడు లేనేలేడు)



*నేను భక్తితో రాసిన శతకమును స్వీకరింపుము అనుచూ .........!*

*ఉ. ఆర్యులకెల్లమ్రొక్కి వినతాంగుఁడనై రఘునాథ భట్టరా*
*చార్యులకంజలెత్తి కవి సత్తములన్ వినుతించి కార్యసా*
*కర్యమెలర్ప నొక్క శతకంబొనఁగూర్చి రచింతునేఁడు తా*
*త్పర్యమునన్ గ్రహింపుమిది దాశరథీ కరుణాపయోనిధీ. 5*

**తా.** గౌరవముతో పూజ్యులయిన పెద్దలకు మ్రొక్కి, రఘునాథ భట్టాచార్యులకు నమస్కరించి, కవీశ్వరులను స్తుతించి, నా కార్యములను నెరవేరుటకుగాను ఈ దినమున ఒక శతకము రచించితిని. ఆ శతకములోని భావమునందలి విషయములో భక్తిని చూచి స్వీకరించుము. (నాకదియే పరమానందము).